౨౦

# నా హార్మోనీ పెట్టెలో ప్రేమలేఖలు

ఉత్తరం రాయడమంటే ఏమిటో బద్ధకమండీ? కలం కనిపించదు కాగితం కనిపించదు. రెండూ కనిపిస్తే పిల్ల వూరుకోదు. ఈమూకతో నా బొంద. ఉత్తరాలు రాయడంకూడా పడుతుందా? ఉత్తరాలంటే జ్ఞాపకమొచ్చింది-చిన్నప్పుడు మనం ఊరికే రాసుకునేవాళ్ళం కామూ? మొన్న హార్మనీ పెట్టెలో అట్టడుగున నా పాటల పుస్తకంలో దొరికాయి కొన్ని ఉత్తరాలు....అవి చదువుతూవుంటే మీరూ నేనూ పది పదిహేనేళ్ళ

వెనక్కి వెళ్ళిపోయాం. అప్పుడు మీరు రాసిన ఉత్తరాలు ఇప్పటికీ చదువుకుంటే బాగానే అనిపించింది. పిల్లలు తీసి చూస్తారేమో కమ్మ! మీ ఉత్తరం కోసం వీధిలోంచి ఇంట్లోకి. ఇంట్లోంచి వీధిలోకి తిరిగేదాన్ని. అమ్మమా నీకు ఉత్తరం వచ్చిందే అంటూ నాన్న నామీద కవరు గిరాటు పెట్టగానే నాకు ఎలా వుండేదనంటారు? ఆ ఉత్తరంలో మీరు రాసిన సంగతులు చదువుతోంటే ఎవరో మల్లెపూలు విసిరినట్లు మంచి గంధం చల్లినట్లు మనసు పరవశించి పోయేది.

నాకు బాగా జ్ఞాపకం-మీరు నాకు రాసిన మొట్టమొదటి ఉత్తరం. మా అమ్మ చింపి పట్టుకొచ్చి "ఇదిగో నీ మొగుడు రాశాడే" అని సింహాచలం సంపెంగి చెట్టుకు చిట్టారు కొమ్మన పూసిన పూల కోసం నిచ్చెన వేసి ఎక్కబోతున్న నాకు చదవమని ఇచ్చింది. అప్పుడు నాకు చెడ్డ గొప్పగా వుండేది. సంస్కృతం చదువుకోమని. ఉత్తరం సమాధానం రాయమని అందులో వుంది. అప్పుడు నన్ను మా అమ్మా నాన్నా దగ్గర కూర్చోబెట్టుకొని "ఆతను ఏమన్నా అనుకుంటాడు బాగుండదే"-అని బలవంతాన నాచేత తుడుపులూ కొట్టివేతలు లేకుండా మీకు జవాబు రాయించారు. నాకుమీరు రాసే ఉత్తరాలు కొన్నాళ్ళు మా అమ్మ చదివి నాకిస్తూ వుండేది. మానాన్న కోప్పడ్డాక మా అమ్మ నా ఉత్తరాలు చించి చదవడం మానుకుంది. "నీమొగుడికి ఉత్తరాలు రాసుకో" అంటూ మానాన్న ఇన్ని కవర్లు తెచ్చిపడేశాడు. పెళ్ళయిన కన్నె మనసులో ఎలాంటి ఊహలుంటాయో అవన్నీ మాటలతో బొమ్మకట్టడం ఫస్టుఫారం ఫెయిలయిన నా వల్లనయే పనా? ఆ తరువాత మీరు రాసిన ఉత్తరాలు చూచి నేనూ జవాబు చక్కగా రాయాలనుకుని కొట్టేసి చింపి రాసి మళ్ళీమళ్ళీ చదువుకుని మీకు పోస్టులో వేసే దాన్ని. నాకు ప్రేమలేఖలు రాసుకునేందుకు ఓ పెన్ను కొనిపెట్టారు, మా నాన్న.

ఆ ఉత్తరాలు కట్టలు కట్టలు పెట్టెలో బడి దొర్లుతున్నాయి. ప్రతి ఉత్తరానికి గంధమో సెంటో రాసేదాన్ని. పట్టుచీర మడతలో గుమగుమ

లాడే పాట పాడేదాన్ని. జీవితం అంత గుమగుమలాడి పోవాలని నా చిన్న మనసులో ఏవో కోరికలు గూడుకట్టుకుని వుండేవి కాబోలు!

ఇప్పుడా ఉత్తరాలన్నీ ఏవి చేయటం? సాధారణంగా ఇల్లాళ్ళు తమ చిన్ననాటి ఉత్తరాలను ఏవి చేస్తూంటారు? సీరియలు నవలల్లా బైండ్లు కట్టించుకుంటారా? చింపేసి పారేస్తారా—ఒకనాడు మనసును ఎంతో మురిపించిన ఈ అజ్ఞానపు రాతలు అందులోని తమాషా చిన్న తనపు కొంటె మాటలూ, వెర్రి వ్యామోహాలూ. అవన్నీ ఇప్పుడు చదువు తుంటూంటే సిగ్గేస్తుంది. మరి! మీరు పండక్కి వచ్చి వెళ్ళిపోతుంటే నా కళ్ళనీళ్ళు తిరిగేవి. మనం ఇద్దరమూ కలిసి హాయిగా వుండకుండా ఈ పరీక్షలు చదువులు పెద్దవాళ్ళమీద వల్లమాలిన చిరాకు కోపం వచ్చేది. మీరు నాతో డబ్బెట్టి పేకాడేవారు. గుర్తుందా? నేను మానాన్న జేబులో నుంచి డబ్బులాగేసి మీతో జూదం ఆడుతుండేదాన్ని—మానాన్న కారా కిళ్ళీలు కట్టమనేవారు నన్ను. నేను నాలుగు కిళ్ళీలు ఆయనకు కట్టి ఇచ్చి రెండు బొడ్డులో దోపుకునేదాన్ని. అలా నాకు కారా కిళ్ళీలు వేయటం అల వాటయింది. నేను కారాకిళ్ళీ ఇప్పుడు పిల్లలు పుట్టి పెరిగాక మానేశానను కోండి. కాని పెద్దవాళ్ళకు తెలిస్తే భూకంపం వచ్చినట్టు బాధపడతారు. పాపం—నా మూలకంగా మీరు కారాకిళ్ళీ నేర్చుకున్నారు. వారు పీడవుతా రంటారు. ఇదే కాబోలు!

మీరు నాకు ఉత్తరాలు రాయటం నేర్పారు. నేను మీకు కారాకిళ్ళీ నేర్పాను. మీరు డబ్బు సంపాదించి తెచ్చి పడేస్తున్నారు. మీకు. మీ సంతా నానికీ ఇంటెడు చాకిరీ చేస్తున్నాను. మన ఇద్దరం ఈ సంసారానికి జీతం భత్యంలేని నవుకర్లం.

అప్పుడు నేను హాయిగా పప్పన్నం ఆవకాయా పెరుగు వేసుకు తిని స్నేహితురాళ్ళతో ఆడుకుంటూ తోటలు, చెట్లూ, దేవుడిగుడి, చెరువు దగ్గర తిరిగితిరిగి వచ్చేదాన్ని. మా నాన్న ఉమాపతి మందుల

పెట్టెలో మందుల పేర్లన్నీ నాకు కంఠతా వచ్చు నేను మందులు కట్టి వచ్చిన వాళ్ళకు ఇస్తూ వుండేదాన్ని. కానీ మా నాన్న మందుకోసం వచ్చినవాళ్ళకు వేసే ప్రశ్నలు నాకు నవ్వు పుట్టిస్తూండేవి. ఉమాపతీ వైద్యంలో రోగం కన్నా ప్రశ్నలలో ఎక్కువ బాధపడతాడు రోగి. ఆ మందులిచ్చేముందు ఏమిటి తిన్నావని అడిగి ఆ తినకూడని దేహో తిన్నందుకు రోగిని రోగి తాలూకు బంధువుల్ని బూతులు తిడుతూ వుండేవాడు మా నాన్న!

నేను మీ ఇంటి కొచ్చాక కాఫీతాగటం నేర్చుకున్నాను. మీరు నాకు పత్రికలు, కథలు చదవడం నేర్పారు. ఇప్పుడు నా కనిపిస్తుంది. మొగుడే కాపరానికి రాబోయే పెళ్ళాన్ని తీర్చిదిద్దుకునే వాడు అరోజుల్లో. కాపురానికెళ్ళటంతో ఆడ పిల్లకు నిండుతనం గౌరవం వచ్చేస్తాయి. ఇప్పటికీ, ఎప్పటికీ మొగుడే పెళ్ళాన్ని తనకు కావలసిన చక్కటి పద్ధతిలో తీర్చిదిద్దుకోవాలి. ఇందులో ఎక్కువ తక్కువ లేమిటి నా మొహం? మొగరాక్షసులూ ఆడ పీనుగులూ వుంటే వుంటారు నవలల్లో. కాని జీవితాల్లో సర్దుకుంటూ పోవాలి. ఆడా మగా అంటూ పోట్లాడుతూ కూర్చుంటే మీకర్మ మీది! ఈలోగా నా వయసు సొగసూ మనల్నిదాటి పలకరించకుండా వెళ్ళిపోతాయి. ఈవాళేమిటిలా ఆరిందాలా పెద్ద నవలలు రాసేదానిలా మాట్లాడేస్తున్నాను?

అన్నట్లు "నా డవుటు" అలానే వుండిపోయింది. ఈ హార్మనీ పెట్టెలోని ప్రేమలేఖల్ని ఏమి చేయమంటారు? అంత సిగ్గెందుకండీ అలా వినిపించనట్లు మిమ్మల్ని కానట్లు వెళ్ళిపోతున్నారు.? అయితే ఇల్లాళ్ళందరూ కోర్టు దస్తావేజులు, ప్రామిసరీ నోట్లలా పెట్టి అంతా ఆక్రమించుకున్న చీరె మడతల్లోని ఈ పాత వుత్తరాలను ప్రేమలేఖల కట్టలను ఏమి చేస్తారు? బైండు కట్టించి గత స్మృతుల్ని రెండు అట్టల మధ్య బంధించగలరా అని అడుగు తున్నాను.

చెప్పండి నా ప్రశ్నలకు సమాధానం?